


# మలిదశ పోరులో మోతె మోగించారు

**కేసీఆర్ వెన్నంటి నిలిచిన గ్రామం.. ఈ ఊరు మట్టితోనే ముడుపుకట్టిన కేసీఆర్**


## రాష్ట్రసాధన తర్వాతే ముడుపు విప్పిన ఉద్యమ నేత

- **స్వరాష్ట్రంలో ఈ పల్లెను మరవని గులాబీ పార్టీ**
- **అన్ని రంగాల్లో అభివృద్ధి బాట పట్టించిన వేముల**

మోర్తాడ్, ఏప్రిల్ 14: తెలంగాణ మలిదశ పోరుకు ఆ పల్లె అండగా నిలిచింది. ఊరంతా నాటి ఉద్యమ సారథి కేసీఆర్ వెంట నడిచింది. తెలంగాణ సాధనకు ఒంటరిగా బయల్దేరిన కేసీఆర్‌కు మొట్టమొదట మద్దతు ప్రకటించింది.. నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలంలోని మోతె గ్రామం. బీఆర్ఎస్ వెంటే నడుస్తామని, స్థానిక ఎన్నికల్లో ఏకగ్రీవంగా గెలిపించుకుంటామని తీర్మానించడం ఉద్యమానికి నాడు మరింత బలాన్నిచ్చింది. మోతెతో ఎంతో అనుబంధం పెంచుకున్న ఉద్యమ సారథి ఆ పల్లెను అలాగే వదిలేయలేదు. పదేండ్ల పాలనలో వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పల్లెను అభివృద్ధి బాట పట్టించారు.

**సమైక్యాంధ్రలో కష్టాలు.. స్వరాష్ట్రంలో అభివృద్ధి పరుగులు..**

సమైక్యాంధ్రలో మోతె గ్రామస్తులు ఎన్నో కష్టాలు స్వరాష్ట్రం వచ్చాక అవన్నీ తొలగిపోయాయి. 'తలాపున పారుతుంది గోదారి.. మాచేను చెలక ఎడారి' అనే దుస్థితి నుంచి రెండు కాలాలు పంటలు పండించుకునే స్థాయికి మోతె చేరుకుంది. ఈ గ్రామానికి ఒక వైపు కప్పలవాగు, మరోవైపు పెద్దవాగు ఉంటాయి. కానీ తాగు, సాగునీటికి దశాబ్దాలుగా గోసపడ్డారు. ఈ విషయాన్ని గుర్తించిన కేసీఆర్ రాష్ట్రం ఏర్పడిన వెంటనే మోతె గ్రామస్తులకు చెందిన మూడు వేల ఎకరాలకు వంద శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం కల్పించారు. కేసీఆర్ సహకారంతో మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి గ్రామాన్ని అభివృద్ధి బాట పట్టించారు. రూ.12 కోట్లతో కప్పలవాగుపై రెండు చెక్‌డ్యాంలు, రూ.16 కోట్లతో పెద్దవాగుపై రెండు చెక్‌డ్యాంలు నిర్మించారు. గ్రామంలోని పెద్ద చెరువుకు రూ.4కోట్లతో మాటుకాలువ నిర్మాణ పనులు చేయించారు. దీంతో ఒకప్పుడు సాగునీరు లేక ఇబ్బంది పడిన రైతులకు రెండు పంటలు పండించుకునే అవకాశం లభించింది. మరోవైపు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రూ.1.05కోట్లతో జీపీ భవనం, రూ.2.50 కోట్లతో పీహెచ్‌సీ నిర్మాణం, రూ.2 కోట్లతో సీసీరోడ్లు, రూ.కోటి వ్యయంతో బైపాస్‌రోడ్డు, రూ.12కోట్లతో కప్పలవాగుపై వంతెన, మోతె –వేల్పూర్ నడుమ వాగుపై రూ.15 కోట్లతో హైలెవెల్ బ్రిడ్జి నిర్మించారు. ఇటీవల రూ.50లక్షలతో పీహెచ్‌సీకి ప్రహారీ నిర్మాణం పనులు జరిగాయి. ఉద్యమానికి మద్దతుగా నిలిచి మిగతా గ్రామాలకు దిక్సూచిలా నిలిచిన మోతె గ్రామం అభివృద్ధిలోనూ ఆదర్శంగా నిలిచింది.




మోతె గ్రామస్థులతో ఉద్యమ సారథి కేసీఆర్, తెలంగాణ సాధించిన అనంతరం మోతె గ్రామానికి వచ్చి ముడుపు విప్పుతున్న కేసీఆర్

### ఉద్యమ స్ఫూర్తిని చాటిన మోతె

తెలంగాణ ఉద్యమంలో అండగా నిలిచిన మోతెకు మే 5, 2001న ఉద్యమనేత కేసీఆర్ వచ్చారు. ఉద్యమానికి అండగా నిలిచిన గ్రామస్తులను అభినందించారు. అదే రోజు మోతె మట్టిని ముడుపుకట్టి తన వెంట తీసుకెళ్లారు. రాష్ట్రాన్ని సాధించుకున్నాకే మోతెకు వచ్చి ముడుపు విప్పుతానని ప్రకటించారు. ఇది తెలంగాణలోని అన్ని గ్రామాల్లో స్ఫూర్తిని నింపింది. రాష్ట్రాన్ని సాధించుకున్నాక 2014 మార్చి 28న మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, దివంగత నేత వేముల సురేందర్‌రెడ్డి, ఇతర నేతలతో కలిసి కేసీఆర్ మోతెకు వచ్చారు. ముడుపు విప్పి ఆ గ్రామ మట్టిలో కలిపారు.

### కార్యకర్తలను ఇబ్బంది పెడితే వదిలిపెట్టం: చల్లా



గీసుగొండ, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలను ఇబ్బందిపెట్టే అధికారుల పేర్లు డైరీలో రాసుకోవాలని, రెండేండ్ల తర్వాత వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, అప్పుడు వాళ్ల సంగతి చూసుకుంటామని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి హెచ్చరించారు. సోమవారం వరంగల్ జిల్లా సంగెం, గీసుగొండ మండలాలతో పాటు గ్రేటర్ వరంగల్ 15,16,17వ డివిజన్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలతో బీఆర్ఎస్ రజతోత్సవ సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్మారెడ్డి మాట్లాడుతూ టెక్స్‌టైల్ పార్కులో కొందరు గంజాయి మత్తు లో చిన్నారులపై లైంగిక దాడులు చే స్తున్నారని ఆరోపించారు.



రజతోత్సవ సభ కోసం రూ.26 వేల విరాళం చెక్కును కేటీఆర్‌కు అందజేస్తున్న ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలు




కేటీఆర్‌కు రూ. 5వేల విరాళాన్ని అందజేస్తున్న హెచ్‌సీయూ అంధ విద్యార్థి

# మీరే కష్టాల్లో ఉన్నరు.. విరాళం వద్దు

- **ఓరుగల్లు సభకు ఆటో డ్రైవర్లు అందించిన విరాళాన్ని తిరిగి వారికే ఇచ్చిన కేటీఆర్**
- **ఆత్మహత్యలకు పాల్పడిన డ్రైవర్ల కుటుంబాలకు వినియోగించాలని సూచన**
- **రజతోత్సవ సభకు భారీగా తరలి వస్తామన్న ఆటో డ్రైవర్స్ యూనియన్ నేతలు**

హైదరాబాద్ సిటీబ్యూరో, ఏప్రిల్ 14(నమస్తే తెలంగాణ ) : 'కేసీఆర్ పాలనే కావాలి.. కాంగ్రెస్ ప్రభుత్వం పోవాలి' అంటూ ఆటోడ్రైవర్లు సోమవారం తెలంగాణ భవన్ వద్ద నినాదాలతో హోరెత్తించారు. ఓరుగల్లులో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ అభిమానం చాటుకుంటామని రాష్ట్ర ఆటో యూనియన్ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లంతా కలిసి బీఆర్ఎస్ రజతోత్సవ సభ ఏర్పాట్ల కోసం తమవంతుగా రూ.26 వేల విరాళం చెక్కును ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు అందించారు. దానిని సున్నితంగా తిరస్కరించిన కేటీఆర్.. 'మీరే కష్టాల్లో ఉన్నరు.. విరాళం వద్దు' అని తిరిగి వారికే ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో వేలమంది ఆటోడ్రైవర్లు ఉపాధి కోల్పోయి ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విరాళాన్ని వారి కుటుంబాలకు వినియోగించాలని సూచించారు. మీ మద్దతే మాకు గొప్ప విరాళమని చెప్పారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ల కుటుంబాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అనంతరం కేటీఆర్ ఆటోడ్రైవర్లతో కలిసి రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడుతూ.. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లమంతా బయలుదేరుతామని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఆటోడ్రైవర్లకు బూడిదే మిగిలిందని ఆవేదన వ్యక్తంచేశారు. అటు ఆర్టీసీ కార్మికులకు కూడా జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులు పెడుతున్నదని వాపోయారు. కేసీఆర్ పాలనలోనే ఆటో డ్రైవర్లంతా సంతోషంగా ఉన్నట్టు ఆటో జేఏసీ నాయకుడు నిరంజన్ గుర్తుచేశారు. కరోనా సమయంలోనూ మోటారు వాహన పన్నును రద్దు చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని తెలిపారు.




ఖమ్మంలోని 6వ వార్డులో మాజీ మంత్రి పువ్వాడ వాల్‌రైటింగ్

### ఎల్కతుర్తికి వేలాదిగా తరలిరావాలి

**మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

ఖమ్మం, ఏప్రిల్ 14 : హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ఖమ్మంజిల్లా నుంచి వేలాదిగా ప్రజలు తరలిరావాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం ఖమ్మం నగరంలోని 6వ డివిజన్‌లో రజతోత్సవ సభకు సంబంధించిన వాల్‌రైటింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో జరిగే రజతోత్సవ సభను విజయవంతం చేసి తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చారని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు నాగరాజు, రఘునాథపాలెం మండల అధ్యక్షుడు వీరూనాయక్, కార్పొరేటర్ నాగండ్ల కోటేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బీఆర్ఎస్ ఫ్లోర్‌లీడర్ కర్నాటి కృష్ణ, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బుల్, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- **పోలీసులు వేధిస్తున్నారంటూ సెల్ఫీ వీడియో**




కొణిజర్ల, ఏప్రిల్ 14 : పోలీసులు తనను వేధిస్తున్నారంటూ ఆరోపిస్తూ ఓ బీఆర్ఎస్ కార్యకర్త సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో సోమవారం చోటుచేసుకుంది. రామనర్సయ్యనగర్‌కు చెందిన బాధితుడు జటపిట రవి సెల్ఫీ వీడియోలో తెలిపిన వివరాల ప్రకారం.. మల్లుపల్లికి చెందిన ఓర్సు నరసింహారావు కొణిజర్లకు చెందిన ఓ బాలికను తీసుకుని వెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కిడ్నాప్ కేసు నమోదైంది. కేసు విచారణలో భాగంగా రవిని పోలీసులు స్టేషన్‌కు పిలిచారు. కొణిజర్లకు చెందిన కాంగ్రెస్ నాయకుడితోపాటు మరో ఇద్దరు, పోలీసులు తనను బీఆర్ఎస్ కార్యకర్త అనే కారణంతో కేసులో ఇరికించాలని చూస్తున్నారని, అందుకే తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నట్టు సెల్ఫీ వీడియోలో రవి పేర్కొన్నారు. సోషల్‌మీడియాలో ఆ వీడియో చూసిన కుటుంబసభ్యులు రవిని వెతికి ఖమ్మం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

**విచారణకోసమే స్టేషన్‌కు పిలిచాం: ఏసీపీ**

విచారణ కోసమే రవిని స్టేషన్‌కు పిలిచారని వైరా ఏసీపీ రెహమాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. జటపట రవి వద్ద ట్రాలీ డ్రైవర్‌గా పనిచేస్తున్న నరసింహారావు ఏప్రిల్ 8న తమ కూతురును కిడ్నాప్ చేశారని ఆ బాలిక తల్లిదండ్రులు 10వ తేదీన ఫిర్యాదు చేయగా కొణిజర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రవి తన బైక్ నరసింహారావుకు ఇచ్చి కిడ్నాప్‌నకు సహకరించినట్టు ఆరోపించడంతో ఎస్సై కేసు విచారణలో భాగంగా సోమవారం రవికి ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలని సూచించారు. కిడ్నాప్ కేసుతో తనకు సంబంధం లేదని రవి ఫోన్‌కట్ చేసి.. పోలీసులు వేధిస్తున్నారంటూ ఆరోపణలు చేస్తూ సెల్ఫీ వీడియో సోషల్ మీడియా వేదికగా పోస్టుచేశారని వెల్లడించారు. కొణిజర్ల ఎస్సై సూరజ్‌ను వివరణ కోరగా బాలికను అపహరించిన విషయమై తన బైక్ ఇచ్చి పంపినట్టుగా ప్రాథమిక విచారణలో తేలడంతో రవిని స్టేషన్‌కు పిలిచామని, ఎటువంటి వేధింపులకు పాల్పడలేదని వివరించారు.

- **రజతోత్సవ సభకు విరాళం**



మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగి నరసింహాచారి దంపతులు. చిత్రంలో బడుగుల లింగయ్యయాదవ్ తదితరులు

## పొలాలు, వడ్ల గింజల్లో కేసీఆర్

**కేసీఆర్ కనిపిస్తలే అనేటోళ్లు రైతులను అడగాలి.. సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి**

సూర్యాపేట, ఏప్రిల్ 14 (నమస్తే తెలంగాణ) : 'కొంతమంది పనికిమాలినోళ్లు కేసీఆర్ కనిపిస్తలేరని అంటున్నారు.. అలాంటోళ్లు రైతుల వద్దకు వెళ్లి అడిగితే పంట పొలాలు, వడ్ల గింజల్లో కేసీఆర్‌ను చూపిస్తారు' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 25న వరంగల్‌లో జరుగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కోసం సూర్యాపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ ముఖ్య నాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని తెలిపారు. ఈ నెల 27న ఎల్కతుర్తి సభ తరువాత బీఆర్ఎస్‌లోకి వలసలు వద్దన్నా ఆగవని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లింగయ్యయాదవ్ పాల్గొన్నారు.

**రజతోత్సవ సభకు విరాళం**

సూర్యాపేట టౌన్, ఏప్రిల్ 14: బీఆర్ఎస్ రజతోత్సవ సభ నిర్వహణ కోసం సూర్యాపేటకు చెందిన ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి, బీఆర్ఎస్ అభిమాని నరసింహాచారి దంపతులు జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి సోమవారం రూ.1,016 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.



అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పోచంపల్లి, పెద్ది సుదర్శన్‌రెడ్డి

### అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలి

**ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి**

ఎల్కతుర్తి, ఏప్రిల్ 14 : అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బహిరంగ సభ ప్రాంగణంలో ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం అంబేద్కర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గ్యాదరి బాలమల్లు, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు వాసుదేవరెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లుతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా కేసీఆర్ పాలన చేశారని చెప్పారు.




నల్లగొండ ఎన్‌జీ కాలేజీ మైదానంలో కంచర్ల భూపాల్‌రెడ్డి వాల్ రైటింగ్. వాల్‌రైటింగ్‌పై సున్నం వేసిన దృశ్యం

### రజతోత్సవ సభ వాల్‌రైటింగ్ తుడిచివేత

**మాజీ ఎమ్మెల్యే కంచర్ల రాసిన వాల్‌రైటింగ్‌ను చెరిపిన దుండగులు**

నీలగిరి, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం చేయాలని నల్లగొండలో రాసిన వాల్‌రైటింగ్స్‌ను కొద్దిగంటల్లోనే గుర్తు తెలియని వ్యక్తులు తుడిపివేశారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఎన్జీ కళాశాల మైదానంలోని గోడలపై సభ విజయవంతం చేయాలని రాయగా.. కొద్ది గంటలకే గుర్తు తెలియని వ్యక్తులు చెరిపేశారు. బీఆర్ఎస్ శ్రేణులు గమనించి మున్సిపల్, ఎన్జీ కళాశాల అధికారులను సంప్రదించగా అంబేద్కర్ జయంతి సందర్భంగా తాము సెలవులో ఉన్నామని తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్ మాట్లాడుతూ బీఆర్ఎస్ రజతోత్సవం సందర్భంగా ఎల్కతుర్తిలో తలపెట్టిన సభను అడ్డుకోవాలని కాంగ్రెస్ కుయుక్తులు పన్నుతున్నదని మండిపడ్డారు. రాజ్యాంగం రచించిన అంబేద్కర్ జయంతి రోజునే హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.




మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లిలో మాజీ ఎంపీ, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కవిత వాల్ రైటింగ్. దంతాలపల్లిలో మాట్లాడుతున్న రెడ్యానాయక్

### 25 ఏండ్ల పండుగను విజయవంతం చేయాలి

- **మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్**

దంతాలపల్లి/నర్సింహులపేట, ఏప్రిల్ 14: బీఆర్ఎస్ 25 ఏండ్ల పండుగను విజయవంతంచేయాలని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ పిలుపునిచ్చారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాలోని దంతాలపల్లి, నర్సింహులపేట మండల కేంద్రాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో కార్యకర్తలతో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలను అందించడంలో విఫలమైన కాంగ్రెస్ పరిస్థితిని ప్రజలకు వివరించి.. వచ్చే స్థానిక సంస్థల్లో సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, పీఏసీఎస్‌లో వార్ వన్‌సైడ్ చేయాలని సూచించారు. కాంగ్రెస్ పరిపాలన చూస్తుంటే ఒడు మూడురోజుల్లో సీఎం మార్పు తప్పదేమో అనిపిస్తున్నదని చెప్పారు. అనంతరం సూర్యాపేట రోడ్డులో చలో వరంగల్ వాల్ రైటింగ్‌ను మాజీ ఎంపీ కవిత ప్రారంభించారు. బహిరంగ సభకు గ్రామానికి చెందిన అనిల్ 50 కేజీల బియ్యం విరాళంగా అందజేశారు.



యాదగిరిగుట్టలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల, టెస్కాబ్ మాజీ చైర్మన్ గొంగిడి, బీఆర్ఎస్‌వీ రాష్ట ఉపాధ్యక్షుడు తుంగ బాలు, బాలరాజుయాదవ్ తదితరులు

### యాదగిరిగుట్టకు పాదయాత్ర

**బీఆర్ఎస్‌వీ ఆధ్వర్యంలో కదలిన గులాబీ సైన్యం**

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 14 : బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు ఆధ్వర్యంలో సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా రాయగిరి కమాన్ నుంచి యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ఆలయ వైకుంఠ ద్వారం వద్దకు పాదయాత్ర చేపట్టారు. భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, బీఆర్ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్ జెండాను ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా రజతోత్సవ సభ విజయవంతం కావాలని స్వామివారికి మొక్కి, సీఎం రేవంత్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని వేడుకున్నారు.